

# ఫర్నిచర్ గోడెక్కింది!

ఇంట్లో జనాన్నీ, అవసరాన్నీ బట్టి ఫర్నిచర్ కొంటుంటాం. అయితే అవి చాలాసార్లు అడ్డంగా మారుతుంటాయి. ఆ ఉద్దేశంతోనే కొంతకాలం నుంచి స్పేస్ సేవింగ్ ఫర్నిచర్ తయారవుతున్నది. ఆర్ట్‌లా గోడకు అలంకరించుకోగలిగేవి వీటిలో సరికొత్త రకం. అసలది ఫర్నిచర్ అన్న విషయమే అర్థం కానట్టుగా ఉండటం వీటి ప్రత్యేకత.



## వర్క్ డెస్క్... వేలాడదీద్దాం!

**ప్రతి ఇంట్లోనూ** ఓ వర్కింగ్ సెటప్ ఉండాలంటే కష్టం. అంత స్థలం అందరికీ అందుబాటులో ఉండకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో చక్కగా వాడుకోగలిగేలా తయారుచేసిందే 'ఫ్లో వాల్ డెస్క్'. ట్రెండీ ఇంటీరియర్‌కు సరిపడేలా విభిన్న డిజైన్‌తో రూపొందించిన దీన్ని ఒక అలంకారంలాగా గోడకు వేలాడదీసుకోవచ్చు. పని ఉంది అనుకున్నప్పుడు దాన్ని వంచితే.. వర్కింగ్ టేబుల్‌లా మారిపోతుంది. ఇంట్లోని ఓ కుర్చీ తెచ్చుకుని వేసుకుంటే సరి... పనిచేసుకోవచ్చు. వెడల్పు కూడా ఎక్కువగానే ఉంటుంది కాబట్టి రీడింగ్ టేబుల్‌గానూ వాడుకోవచ్చు. పని అయ్యాక ల్యాప్‌టాప్‌తో పాటు దీన్నీ మడిచేయొచ్చు. వాట్ యాన్ ఐడియా సర్ జీ!







## చదువును గోడెక్కిద్దాం!

**చిన్న చిన్న** సామాన్లు పెట్టుకునేందుకు గోడకు అల్మారలను పెట్టుకుంటాం. ఇప్పుడు పిల్లలు ఇంట్లో చదువుకునేందుకు వీలుగా బ్లాక్ బోర్డునీ వేలాడదీస్తున్నాం. స్టడీ టేబుళ్లూ నిత్యం అవసరం అవుతున్నాయి. ఈ అన్ని పనులూ ఒకేచోట కావాలంటే 'మల్టీ ఫంక్షనల్ వాల్ టేబుల్ విత్ చాక్‌బోర్డ్'ను ఎంచుకోవాల్సిందే. ఇది సాధారణంగా మడిచి ఉన్నప్పుడు కేవలం బ్లాక్ బోర్డులా కనిపిస్తుంది. దాని మీద కావాల్సినవి రాసుకునే వీలుని కల్పిస్తుంది. మీట సాయంతో కిందకి లాగినప్పుడు కూర్చుని రాసుకోగలిగేలా... స్టడీ టేబుల్‌లా మారిపోతుంది. ఇలా తీసినప్పుడు గోడకు అల్మారలా ఉంటుందన్నమాట. అందులో పెన్నులూ, పుస్తకాలూ, బొమ్మల్లాంటివి ఏవైనా పెట్టుకోవచ్చు. పిల్లల గదిలో దీన్ని ఉంచామంటే వాళ్ల అవసరాలన్నీ తీరినట్టే. అటు పిల్లలు ఇటు పెద్దలు... ఖుషీ ఖుషీ!

## పెయింటింగ్ కుర్చీలా...



**గోడకు** అందమైన పెయింటింగుల్ని అలంకరించుకోవడం చాలామందికి ఇష్టం ఉంటుంది. అలాంటి ఇష్టాన్ని తీర్చుకుంటూనే ఆ పెయింటింగును కుర్చీలాగా ఉపయోగించుకునేలా సరికొత్త ఫర్నిచర్ తయారవుతున్నది. డ్రోర్ స్టూడియో తయారుచేసిన 'పిక్ చెయిర్' అలాంటిదే. కదిలే కాన్వాసుగా దీన్ని చెప్పుకోవచ్చు. జాయింట్లు కలిగిన కాన్వాస్ అంటాడు డిజైనర్ డ్రోర్. సాధారణంగా మనకు స్నేహితులు, బంధువులు వచ్చినప్పుడు ఎక్కువ కుర్చీలు లేదా స్టూళ్లు అవసరం అవుతాయి. వాటికోసం స్థలం కేటాయించకుండా గోడకున్న కాన్వాసు నుంచే వీటిని తీసుకోగలిగేలా పిక్ చెయిర్‌ను రూపొందించారు. నిండైన రంగుల్లో ఇక్కడి గోడ మీద కనిపిస్తున్న అబ్‌స్ట్రాక్ట్ పెయింట్... జాయింట్లు కలిగిన కొన్ని నలుచదరపు పలకలను అమర్చి రూపొందించింది. గబుక్కున కుర్చీ కావాలి అనుకుంటే, ఇందులోని ఓ భాగాన్ని తీసి కుర్చీ లేదా స్టూల్‌లా మార్చి వాడుకోవచ్చు. మళ్లీ తిరిగి పెట్టేయొచ్చు. ఇది అందమైన 'చిత్రం' కదూ!



## ఫొటో టేబుల్...

**డైనింగ్ టేబుల్** ఉంటే... దానికో గది కావాలి. పోనీ ప్రత్యేకంగా స్థలం కావాలి. గబుక్కునే తిని, గిన్నెలు సర్దేసినట్టు దాన్ని పక్కకు సర్దేయలేం. అలాగని అందరూ కింద కూర్చుని తినలేరు. అలాంటప్పుడు మ్యాజిక్ చేసినట్టు డైనింగ్ టేబుల్ ప్రత్యక్షమయ్యేలా చేస్తుంది 'వాల్ మౌంటెడ్ ఫొటో డైనింగ్ టేబుల్'. ఇది సాధారణంగా మనం గోడకు పెట్టుకునే పెద్ద ఫొటోలానే ఉంటుంది. భోజనం చేయాలి అనుకున్నప్పుడు దానిపై భాగాన్ని పట్టి లాగితే చుట్టూ ఉన్న ఫ్రేమ్ టేబుల్ కాళ్లలా విడిపోతుంది. ఇక దాన్ని సరిగా అమర్చి, కుర్చీ లాక్కుంటే... తినేయడమే. తిరిగి మడిచేశామంటే.. ఛూ మంత్రకాళీ... డైనింగ్ టేబుల్ మాయం!

